గడువులోగా సీఎంఆర్ ధాన్యాన్ని అప్పగించాలి

సీఎంఆర్ ధాన్యం అప్పగింతపై రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్

- అదనపు కలెక్టర్ నగేశ్

వనపర్తి,జూలై 23 : కేంద్ర ఆహార సంస్థకు అందజేయాల్సిన సీఎంఆర్ ధాన్యాన్ని నిర్ణీత గడువులోగా అప్పగించాలని అదనపు కలెక్టర్ నగేశ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని మిల్లర్లతో ధాన్యం అప్పగింతపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023-23 సంవత్సరంలో అప్పగించాల్సిన ధాన్యంపై మిల్లు వారీగా యాజమానితో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా ధాన్యం అప్పగించాలని అందుకు మిల్లు సామర్థ్యం మేరకు అడించి ధాన్యం అప్పగించాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్‌సీఐ నిబంధనల ప్రకారం ధాన్యం నాణ్యతగా ఉండాలని లేకపోతే నిరాకరిస్తామని తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ అకౌంటెంట్ బాలు నాయక్, జిల్లాలోని రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ఎస్పీ తోట శ్రీనివాసరావు
- పోలీస్ అధికారులతో నెలవారి నేర సమీక్ష

సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ తోట శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, జూలై 23 : జిల్లాలో ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ తోట శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో మంగళవారం నెల వారి నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెలలో నమోదైన ఆత్మహత్య కేసులలో దానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసును పారదర్శకంగా విచారణ చేపట్టి నిర్ణీత సమయంలో ఛేధించాలన్నారు. అలాగే రేషన్ బియ్యం, డ్రంకెన్ డ్రైవ్, ఇసుక అక్రమంగా తరలించే వారిపై నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం దొంగతనం కేసులను ఛేధించడంలో ప్రతిభ కనబర్చిన నలుగురు సిబ్బందికి రూ.2వేల క్యాష్ రివార్డ్‌తో అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు భీంకుమార్, రవి బాబు, టాటాబాబు, ఎస్సైలు ఉన్నారు.

పత్తి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

వీసీలో పాల్గొన్న డీఏవో గోవిందు నాయక్

అయిజ, జూలై 23 : వానకాలంలో సాగు చేసిన పత్తి, వరి పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రాంప్రసాద్, రాజేంద్రనగర్ వరి పరిశోధన కేంద్రం శాస్త్ర వేత్త కిరణ్ బాబు పత్తి సాగు, వరి తెగుళ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీసీ ద్వారా రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పంటల సాగులో యాజమాన్య పద్ధతులతోపాటు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం డీఏవో గోవింద నాయక్ మాట్లాడుతూ.. వానకాలంలో పత్తిసాగు చేస్తున్న రైతులు తెగుళ్లను నివారించగలిగితే పంట దిగుబడి పెరుగుతుందన్నారు. లక్షలోపు రుణ మాఫీ కాని రైతులు ఏఈవోలను సంప్రదించి అనుమానాలను నివృతి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏవో శంకర్‌లాల్, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి/వనపర్తి టౌన్, జూలై 23: సెకండ్ ఏఎన్ఎంలు సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీహరి, జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సెకండ్ ఏఎన్ఎంల జిల్లా కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, ఏఎన్ఎలకు ఇచ్చే వేతనాలనే సెకండ్ ఏఎన్ఎంలకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని, ఏఎన్ఎంల పోస్టులు భర్తీ చేయాలని, ఆపోస్టుల భర్తీలో సెకండ్ ఏఎన్ఎంలకు వెయిటేజ్ ఇవ్వాలన్నారు. అనేక సమస్యలతో సెకండ్ ఏఎన్ఎంలు ఇబ్బందులు పడుతున్నారని వైద్య రంగంలో వారి పాత్రను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రమేశ్, సెకండ్ ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, లక్ష్మమ్మ, నాగలక్ష్మి, కొండమ్మ, సబిత, గ్రేస్, సుమిత్ర, చంద్రమ్మ, ఉమా మహేశ్వరి, శ్రీదేవి ఉన్నారు.

ఈత వనాల పెంపుతో గీత కార్మికులకు ఉపాధి

అయిజ, జూలై 23 : ఈత వనాల పెంపుతో గీత కార్మికులకు ఉపాధి లభిస్తుందని ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం మండలంలోని మేడికొండ గ్రామంలో గ్రామ గీత కార్మికుల ఆధ్వర్యంలో ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో గీత కార్మికులు ఈత మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈత వనాలతో గీత కార్మికులకు చేతి నిండా పని దొరుకుతుందన్నారు. ఈత చెట్లను కాపాడేందుకు గీత కార్మికులు కృషి చేయా లన్నారు. కార్యక్రమంలో రామన్‌గౌడ్, నర్సింహులు గౌడ్, శివన్న గౌడ్, గిద్ద రామయ్య గౌడ్, చిన్న నర్సింహులు గౌడ్, చిన్న రంగస్వామి గౌడ్, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేడికొండలో ఈత మొక్కలు నాటుతున్న సీఐ గణపతిరెడ్డి

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి..

- ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి, జూలై 23 : జిల్లాలో లక్ష్యం మేరకు వన మహోత్సవంలో మొక్కలు నాటి వాటి వివరాలు ఆన్‌లైన్ నమోదు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో వన మహోత్సవం కార్యక్రమం పురోగతిపై ఇన్‌చార్జి కలెక్టర్ వెబ్‌ఎక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా జిల్లాకు 18.39లక్షలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా 10 లక్షలు, ఇరిగేషన్ శాఖకు 2లక్షలు, మున్సిపాలిటీ, పంచాయతీ రాజ్ ద్వారా మిగిలిన మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు గ్రామీణాభివృద్ధి, అటవీశాఖ తప్పా మిగిలిన శాఖలు పెద్దగా లక్ష్యాలు సాధించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కలు నాటి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఇదే అంశంపై శుక్రవారం సమీక్షా సమావేశం ఉంటుందని, ఎప్పటిలోగా మొక్కలు నాటి పూర్తి చేస్తారో నివేదికతో రావాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, తాసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి పనిచేయాలి

వనపర్తి, జూలై 23 : జిల్లాలోని ప్రైవేట్ దవాఖానలు నిబంధనలకు లోబడి పనిచేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలో కొత్తగా దవాఖానలు, ఉన్న వాటికి రెన్యువల్స్‌కు సంబంధించిన అనుమతులపై జిల్లా వైద్యారోగ్యశాఖ ఆ ధ్వర్యంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భస్థ శిశువు స్కానింగ్ చేయడానికి పీసీపీ యాక్టు 1994ను పాటించాలన్నారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దవాఖానల ప్రతిపాదనలు తిరస్కరించి, నిబంధనలకు లో బడి ఉన్న 15 దవాఖానలు, 9 ఆయుష్ క్లినిక్ దవాఖానలను ప్రతిపాదనలకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి జయచంద్రమోహన్, భాస్కర్ ప్రభాత్, డాక్టర్లు , సిబ్బంది పాల్గొన్నారు.

వినూత్నంగా ఆలోచనలకు మంచి వేదిక : అదనపు కలెక్టర్ నర్సింగరావు

ప్రైవేట్ దవాఖానల అనుమతులపై జిల్లా స్థాయి వైద్యబృందం కమిటీతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

గద్వాల,జూలై 23: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ద్వారా వినూత్నంగా ఆలోచించే వారికి మంచి వేదిక దొరికందని అదనపు కలెక్టర్ నర్సింగరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో ఇంటింటా ఇన్నోవేటర్ 2024పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వయస్సు, విద్యతో సంబంధం లేకుండా ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. ఎంపికైనా వారికి స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా బహుమతులు అంద జేస్తామన్నారు. కార్యక్రమంలో డీపీవో వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బైక్‌ను ధ్వంసం చేసిన దుండగులు

రాజోలి, జూలై 23 : ఇంటివద్ద నిలిపిన దివ్యాంగుడి నాలుగు చక్రాల వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన మాన్‌దొడ్డిలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దివ్యాంగుడు మాదన్న బైక్‌ను మంగళవారం ఇంటివద్ద పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌ను ఊరి చివరకు తీసుకెళ్లి ధ్వంసం చేసి డ్రైనేజీలో పడేశారు. బాధితుడు మాదన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు పేర్కొన్నారు.

కూలిన మట్టిమిద్దె

రాజోలి, జూలై 23 : మండలంలోని తూర్పు గార్లపాడు గ్రామంలో మార్కెకు చెందిన మట్టి మిద్దె సోమవారం అర్ధరాత్రి కూలింది. కురుస్తున్న ముసురు వానలకు మిద్దె కూలిపోగా ఆ సమయంలో కుటుంబ సభ్యులు వేరే గదిలో నిద్రిస్తుండగా పెను ప్రమాదం తప్పింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యక్తి పై కేసు నమోదు

గోపాల్‌పేట, జూలై 23 : పొలం చుట్టూ ఏర్పాటు చేసిన కంచె గేటుకు తాళం వేసి, కాపలా పెట్టిన వ్యక్తిని లోపలికి పోకుండా అడ్డుకున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హరిప్రసాద్ కథనం మేరకు.. పాన్‌గల్ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి గోపాల్‌పేట మండలం మున్ననూర్ గ్రామానికి చెందిన శ్రీధర్‌గౌడ్ వద్ద 7ఎకరాల 23 గుంటల భూమి కొని, మామిడి మొక్కలు నాటి చుట్టూ ఫిన్సింగ్ చేసి, గేటు ఏర్పాటు చేశాడు. కాపలాగా అదే గ్రామానికి చెందిన ఎద్దుల వెంకటయ్యను ఉంచాడు. ఇది ఇలా ఉండగా కొన్ని రోజుల కిందట అదే గ్రామానికి చెందిన నారాయణగౌడ్ అనే వ్యక్తి గేటుకు తాళం వేసి తనను లోపలికి వెళ్లనీయడం లేదని వెంకటయ్య తోట యజమాని కొత్తపేటలో ఉన్న వెంకట్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. మున్ననూర్ చేరుకున్న వెంకట్‌రెడ్డి గ్రామస్తుల ద్వారా నారాయణగౌడ్‌తో మాట్లాడించగా, నీకు ఇక్కడ భూమి లేదని, వెంకట్‌రెడ్డిని నారాయణగౌడ్ దుర్భాషలాడటంతో మంగళవారం వెంకట్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సర్వే చేయకుండానే వెనుదిరిగిన అధికారులు

అయిజ రూరల్ , జూలై 23 : జిల్లా భూసర్వే అధికారులు సర్వే చేయకుండానే వెనుదిరిగినా ఘటన మండల పరిధిలోని బింగిదొడ్డి గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం అయిజ పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ సుమంగళి శ్రీధర్ బింగిదొడ్డి గ్రామ శివారులో 62 సర్వేనెంబర్ భూమిలో తనకు 3ఎకరాల 16గుంటలు భూమిని చూయించి తనకు న్యాయం చేయాలని హైకోర్టును ఆశ్రయించింది. దీంతో కోర్టు భూమిని సర్వే చేయాలని సంబంధిత జిల్లా సర్వే అధికారులను ఆదేశించింది. కాగా మంగళవారం జిల్లా సర్వేయర్ డీఈ గోవింద్, అసిస్టెంట్ ఏడీ రామచంద్ర, మండల సర్వేయర్ హరికృష్ణలు సర్వే చేయడానికి పొలం వద్దకు వెళ్లారు. దీంతో బింగిదొడ్డి గ్రామానికి చెందిన రైతులు అధికారులను సర్వే చేయకూడదని అడ్డుకున్నారు. దీంతో అధికారులు చేసేదేమిలేక అక్కడి నుంచి వెనుతిరిగివెళ్లారు. బాధితురాలు సుమంగలి శ్రీధర్ అధికారులు సర్వే చేయకుండా వెళ్లడం బాధకరమని ఆవేదన చెందారు.

నీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు

గద్వాలటౌన్, జూలై 23 : నీటి సరఫరాలో అంతరాయం ఉండకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ సూచించారు. నది అగ్రహారం వద్ద ఉన్న ఫిల్టర్‌బెడ్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని సంబంధిత అధికారులకు చెప్పారు. ఫిల్టర్‌బెడ్ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలన్నారు. నీటి శుద్ధిలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ సందీప్, ఏఈ నితీశ్‌రెడ్డి ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

మల్దకల్, జూలై 23 : మండలంలోని సద్దలోనిపల్లి ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో సురేశ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పాఠాలు చదివించారు. అలాగే విద్యార్థుల హాజరు శాతం, రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని హెచ్ఎంకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం నల్లన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

అయిజ, జూలై 23 : విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో నర్సింహులు శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలను ఎంఈవో తనిఖీ చేశారు. పాఠశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేస్తున్నారని సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించినట్లు ఎంఈవో నర్సింహులు తెలిపారు. పాఠశాలలో ప్రార్థన చేసేందుకు, ఆటలు ఆడుకునేందుకు స్థలం లేదని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో సమగ్రమైన విచారణ చేసి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

120 మందికే రుణమాఫీ

అయిజ, జూలై 23 : అయిజ సింగిల్ విండోలో రూ.లక్ష రుణమాఫీ 120మందికి వర్తించిందని, మరో 508 మందికి సాంకేతిక కారణాలతో నిలిచిపోయాయని, త్వరలోనే అందరికీ రుణమాఫీ జరుగుతుందని సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. రుణమాఫీ జరగగానే రైతులకు తెలియపరుస్తామని, అంతవరకు రైతులు ఆందోళన చెందవద్దని ఆయన మంగళవారం ప్రకటనలో తెలిపారు.

బస్టాండ్‌లో అపరిశుభ్రతపై అసహనం

- ఆత్మకూరు బస్టాండ్‌ను పరిశీలించిన ఆర్ఎం శ్రీదేవి

ఆత్మకూరు బస్టాండ్‌ను తనిఖీ చేస్తున్న మహబూబ్‌నగర్ ఆర్ఎం శ్రీదేవి

ఆత్మకూరు, జూలై 23 : బస్టాండ్ అపరిశుభ్రతపై మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీదేవి అసహనం వ్యక్తంచేశారు. మంగళవారం ఆత్మకూరు బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఆమె బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న దుర్వాసన, మురుగు, అపరిశుభ్రంపై అసహనం వ్యక్తంచేశారు. బస్టాండ్‌ను ప్రతిరోజూ మూడుసార్లు శుభ్రం చేయాలని, ప్లాట్ ఫాంను రోజూ ఫినాయిల్ నీటితో శుభ్రం చేయాలని కంట్రాక్టర్‌కు సూచించారు. బస్టాండ్ ప్రాంగణంలో మొలిచిన పిచ్చిమొక్కలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అదే విధంగా బస్టాండ్ పైకప్పు పెచ్చులు ఊడి వర్షం నీరు కారుతున్న పరిస్థితులను బస్టాండ్ వ్యాపారస్తులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. నిశితంగా పరిశీలించి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో మాట్లాడిన ఆమె ఆర్టీసీ బస్సుల సమయపాలన, సిబ్బంది పనితీరులపై అడిగి తెలుసుకున్నారు. చాలామంది ప్రయాణికులు ఆత్మకూరు నుంచి కొత్తకోట మీదుగా హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని ఆమెను కోరారు. పరిశీలించి త్వరలో బస్సు ఏర్పాటు చేస్తామని ఆమె హామీనిచ్చారు. కార్యక్రమంలో కంట్రోలర్ దాసరి శ్రీనివాసులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

బైలెల్లిన బోనాలు..

ఆత్మకూరు పోచమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

ఆత్మకూరు, జూలై 23 : డప్పుల దరువులు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల నృత్యాల హోరు, భక్తజన సందోహం నడుమ బోనాల ఉత్సవాలు మంగళవారం పట్టణంలో వైభవంగా జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాల్లోనూ బోనాల పండుగ జరుగగా ఆత్మకూరు పట్టణంలో కనుల పండుగగా సాగింది. స్థానిక పోచమ్మ , గజ్జెలమ్మ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. వర్షం కురుస్తున్నా భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించారు. చైర్‌పర్సన్ గాయత్రీయాదవ్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఐ శివకు మార్, ఎస్సై నరేందర్ గట్టి బందోబస్తు నిర్వహించారు.

అమరచింత మండలంలో..

అమరచింత, జూలై 23: పట్టణంలోని శ్రీకృష్ణానగర్‌లో పోచమ్మ బోనాల పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆభరణాలను కుర్వ కులస్తులు రాయిచూర్ నుంచి తీసుకొచ్చి పట్టణ శివారులో ఉంచి ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారికి అలంకరించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ కుటుంబ సభ్యులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనం కుండలను తలపై పెట్టుకొని ఆలయానికి చేరుకొని నైవేద్యాలను సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు ఆలయ కమిటీ అధ్యక్షుడు విష్ణు, కార్యదర్శి కుర్వ రఘు, కోశాధికారి రవి, సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు

అమరచింతలో పోచమ్మకు పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిటీ సభ్యులు

మొక్కలను తల్లితో సమానంగా చూసుకోవాలి

- ఎస్పీ గిరిధర్

మొక్క నాటి నీరు పోస్తున్న ఎస్పీ ఆర్.గిరిధర్, పోలీస్ అధికారులు, సిబ్బంది

వనపర్తి టౌన్, జూలై 23 : వన మహోత్సవంలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ తల్లితో సమానంగా చూసుకోవాలని ఎస్పీ ఆర్.గిరిధర్ అన్నారు. మంగళవారం జిలా కేంద్రంలోని పోలీస్ కార్యాలయ ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెట్లు లేకపోతే భవిష్యత్‌లో దుర్భర పరిస్థితులు ఎదుర్కొవాల్సి వస్తుందని పేర్కొన్నారు. చెట్లు ఉంటే వర్షాలు పుష్కలంగా కురుస్తాయన్న విషయాన్ని గ్రహించి మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్, డీఎస్పీ వెంకటేశ్వర రావు, డీఎసీఆర్‌బీ ఎస్పీ కృష్ణకిశోర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ముని, సీసీఎస్‌సీఐ రవిపాల్, సీఐ నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ మహేశ్, పోలీస్ సిబ్బంది, మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థులు , లారీ , ఆటో అసోసియేషన్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన పోలీసులు

పెబ్బేరు, జూలై 23:వన మహోత్సవంలో భాగంగా మంగళవారం శ్రీరంగాపురం పోలీసులు మొక్కలు నాటారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్సై వెంకటేశ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

స్మితా సబర్వాల్ దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి

స్మితా సబర్వాల్‌పై ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న మహజన్ ఎమ్మార్పీఎస్ నేతలు

వనపర్తి టౌన్/ చిన్నంబావి / అమరచింత, జూలై 23: కేంద్ర ప్రభుత్వ సర్వీస్ ఉద్యోగంలో దివ్యాంగుల కోటపై రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మంగళవారం పలువురు మండిపడ్డారు. వెంటనే ఆమె దివ్యాంగులకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వనపర్తిలో మహజన్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు ఆధ్వర్యంలో ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌ను డిస్మిస్ చేయాలని ఎస్పీ ఆర్.గిరిధర్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే చిన్నంబావి బీఎస్పీ మండలాధ్యక్షుడు బొల్లి కురుమయ్య చిన్నంబావి మండల కేంద్రంలో సమావేశం నిర్వహించి స్మితా సబర్వాల్ తీరుపై మండిపడ్డారు. అమరచింత దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో నాయకులు అమరచింత పోలీస్‌స్టేషన్‌లో స్మితా సబర్వాల్‌పై ఫిర్యాదు చేశారు. ఆయా కార్యక్రమాల్లో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ ప్రభాకర్‌శెట్టి, పాన్‌గల్ బీఎస్పీ మండలాధ్యక్షుడు ఆంజి, వీపనగండ్ల అధ్యక్షులు ప్రశాంత్, కదిరెపాడు మధు విదాత, ఎమ్మార్పీఎస్ నేతలు గంధం గట్టయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య, గంధం లక్ష్మ య్య, వీహెచ్‌పీఎస్ నాయకులు శివనాయక్, బంజారా గిరిజన సమితి రాష్ట్ర నాయకులు తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి

గట్టు, జూలై 23 : ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేయాలని ముదిరాజ్ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు ర్యాలంపాడు నర్సింహులు కోరారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు జిల్లా ముదిరాజ్‌ల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ముదిరాజ్‌ల సంఘం నాయకులు స్థానిక రెవెన్యూ కార్యాలయం ఏఆర్ఐ కృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు లక్ష్మన్న, మండల అధ్యక్షుడు తెలుగు వెంకటేశ్, నాయకులు, తిమ్మప్ప, సురేశ్, సవారన్న, బీచుపల్లి, తిప్పన్న, పరుశురాం, వీరేశ్, పుగ్యాల వెంకటేశ్, గట్టు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

చెన్నారం రైతు వేదికలో రైతు నేస్తం

గోపాల్‌పేట, జూలై 23 : రేవల్లి మండలంలోని చెన్నారం రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా నేరుగా శాస్త్రవేత్తలతో దూరదర్శిని ద్వారా పంటల సాగు, యాజమాన్య పద్ధతులు రైతులకు అవగాహన కల్పించారు. సాగు గురించి రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు వివరించారు. అలాగే వైఎఫ్ఏ- కేవీకే రైతు వేదికలో సమీకృత పోషకాల నిర్వహణ పద్ధతులపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ నిపుణురాలు డాక్టర్ భవానీ పచ్చిరొట్టె ఎరువులు, జీవ ఎరువులు, వర్మీకంపోస్టు ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ చంద్రశేఖర్, ఏ వో అనిల్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్త భవాని, ఏఈవోలు రైతులు పాల్గొన్నారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

వనపర్తి,జూలై 23 : ఈనెల 24వతేదీ బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను అన్ని మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ మంగళవారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అనంతరం మండల కేంద్రాల్లోని దవాఖానలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేయాలని, అలాగే రక్తదాన శిబిరాలు, ఇతర కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించాలని కోరారు.

గట్టు మండలంలో..

గట్టు, జూలై 23 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని 24వ తేదీ బుధవారం ఘనంగా నిర్వహించాలని నాయకులు, కార్యకర్తలకు బీఆర్ఎస్ నాయకుడు బాసు హన్మంతు మంగళవారం ప్రకటనలో కోరారు. మండల కేంద్రాల్లోని ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేయాలని కోరారు. అదేవిధంగా సామాజిక కార్యక్రమాలను కూడా నిర్వహించాలన్నారు.

రామన్నగట్టు రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలి

పాన్‌గల్, జూలై 23: రామన్నగట్టు రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలని బీఆర్ఎస్ నాయకులు కరుణాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రేమద్దుల గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతేడాది కేసీఆర్ ప్రభుత్వం మండలంలోని కిష్టాపూర్ గ్రామ సమీపంలోని రామన్నగట్టు రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేసి శిలాఫలకం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకొని పనులు ప్రారంభించాలని కోరారు. అదేవిధంగా రేమద్దులకు వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

ఎల్‌వోసీ అందజేత

కొత్తకోట,జూలై23 : మండలంలోని అప్పరాల గ్రామానికి చెందిన రాజు గుండెపోటుకు గురికాగా హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం నుంచి రూ. 3.40లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. కాగా మంగళవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాసన్న, బీచుపల్లియాదవ్, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కార్మికశాఖ కార్యాలయాన్ని మార్చాలి

గద్వాల, జూలై 23 : జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ వెనుక ఉన్న జిల్లా కార్మిక శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుందని వెంటనే కార్యాలయాన్ని మార్చాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆ శాఖ నాయకుడు రాజు మాట్లాడుతూ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారిపై పైకప్పు పెచ్చులు ఊడి పడిపోతున్నాయని దీంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. భవన, ఇతర నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా 2022-2023 సంవత్సరాల్లో నమోదు చేసుకున్న క్లైయిమ్స్ రెండు ఏండ్లు గడుస్తున్నా కార్మికుల ఖాతాలో నిధులు జమకాలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్స్ వెంటనే విడుదల చేసి కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ బాధితులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ, పీడీఎస్ నాయకులు, భవన, ఇతర నిర్మాణ కార్మికులు తిరుమలేష్, లక్ష్మీనారాయణ, బీచుపల్లి, బడేసాబ్, రాజు, ఆనంద్, మహేశ్, వెంకటేశ్, వడ్డెలక్ష్మి, భాగ్యమ్మ తెలుగులక్ష్మీ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల బదిలీ

గద్వాలటౌన్, జూలై 23 : గద్వాల మున్సిపాలిటీలో వివిధ విభాగాల అధికారులు బదిలీ కాగా, ఆర్‌వోగా మరొకరు బాధ్యతలు చేపట్టారు. పట్టణ ప్రణాళిక విభాగంలో టీపీఎస్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ గ్రేటర్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. అలాగే రెవెన్యూ శాఖలో ఆర్ఐగా విధులు నిర్వర్తిస్తున్న రాజ్‌కుమార్ వనపర్తి మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. శానిటరీ విభాగంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున రంగన్న అయిజ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. అయిజ మున్సిపాలిటీలో ఆర్ఐగా విధులు నిర్వర్తిస్తున్న రాజేశ్ ఆర్‌వోగా బాధ్యతలు చేపట్టారు. అలాగే మేనేజర్‌గా డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న ఎల్లారెడ్డి పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇందిర

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పార్వతీని బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో ఎంఎన్‌జేఐవో, ఆర్‌సీసీ హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఇందిరను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఆలయ ధర్మకర్తలను ప్రకటించిన దేవాదాయశాఖ

గోపాల్‌పేట, జూలై 23 : మండలంలోని బుద్దారం గండి ఆంజనేయ స్వామి ఆలయ ధర్మకర్తలను దేవాదాయశాఖ ప్రకటించింది. ఆలయ ధర్మకర్తలుగా పెంటారావు, మధుకర్‌రావు, తిరుపతయ్య, రవిగౌడ్, భాగ్యమ్మ, తార్యా నాయక్, లక్ష్మిలను ప్రకటిస్తూ మంగళవారం దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీచేసినట్లు వారు తెలిపారు.

ఘనంగా వన మహోత్సవం

ధరూరు, జూలై 23 : చెట్ల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యత పెరిగి ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. ఎడతెరిపి కురుస్తున్న వర్షాల సందర్భంగా మండలంలోని నెట్టెంపాడు గ్రామంలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పంచాయతీ కార్మికులు పాల్గొని మొక్కలు నాటారు. అలాగే వైకుంఠదామం పరిసరాల్లో ప్రజలు మొక్కలు నాటారు.